

*కథ 1996*

**5**

# తిర్యగ్రేఖ

ఆడెపు లక్ష్మీపతి

చిత్రం, అడుగులు ముందుకు పడుతూంటే ఎన్నో ఏళ్ల తర్వాత కాలేజీ కాంపౌండు లోకి ప్రవేశించినట్టుగా విచిత్రమైన అనుభూతి. ఎన్నాళ్లు? నెలలా, సంవత్సరాలా? షిట్, కేవలం రెండు రోజులు. ఈ స్వల్పకాలం నీకు తెలీకుండానే నీలో గాఢమైన పరిణతి తెచ్చిందా?

అదే తోట, బాటకు ఇరుపక్కలా చక్కగా కత్తిరించిన ఫెన్సింగు, ఇందులో మూలమూలనా విరగబూసిన నందివర్ధనం చెట్లు; మధ్యలో నేర్పుగా అమర్చిన దీపపుచిమ్మెల వంటి పసుప్పచ్చటి పూలగుత్తుల పూజ గన్నేరులు. అరఫర్లాంగు దూరం తర్వాత కుడివైపు మలుపు వద్ద స్వాగతం పలుకుతున్న పామ్‌చెట్లు, ఆ వెనక వినయంగా నిలబడ్డ అశోక వృక్షాల వరుస, కాలేజీ భవనానికి అభిముఖంగా ఫౌంటేన్; చుట్టూ పుడమి తల్లి అందిస్తున్న పూలగుచ్ఛాల్లాంటి ఎర్రని ఎక్సోరా పూపొదలు.

అదే కాలేజి, బహుళ సంఖ్యలోని చలువ రాతి మెట్లు, మొగలు దర్బారు నమూనాలో విశాలమైన ప్రవేశ ద్వారం; రెండువైపులా గంభీరంగా అవలోకిస్తూ కూర్చుని ఉన్న సింహాల ప్లాస్టర్ ప్రతిమలు. హిందూ పారశీక శిల్ప కళను ప్రతిబింబిస్తూ బలిష్ఠమైన స్థంభాల మీది బరువైన గుమ్మటాకారపు పురాతన శిఖరం, అరబ్బీ కాలిగ్రఫీ మాలికల్ని డిజైనుగా అల్లిన లోకప్పు, విప్పారిన డేగ రెక్కల్లా పార్శ్వాలకు విస్తరించిన భవన సముదాయం. కల్లోలాలు, కలహాలు కళ్లెదుట సంభవిస్తున్నా, జడివాన హోరుగాలులు మేనిపై దాడి చేస్తున్నా శతాబ్దాల నుండి చలించకుండా మొక్కవోని దర్పానికీ, సడలని స్వాభిమానానికీ ప్రతీకగా నిల్చిన కాలేజి బిల్డింగు ఉదయ కిరణాలతో తడుస్తూ వినీలాకాశం నేపథ్యంలో విస్పష్టమైన కటౌట్‌లా వుంది.

అక్కడ పచ్చికలో గుంపులు గుంపులుగా కూర్చొని సరదాగా కబుర్లాడుతున్న నీ క్లాస్‌మేట్లు, స్నేహితురాళ్లు. అదిగో, బోగన్‌విల్లా పొద వెనక నుండి నడుస్తూ మెట్ల వేపు కదులుతున్న రెబెక్కా, మీనాక్షి, మధూలిక, లావణ్య... పాతలోకం, పాత పరిసరాలు. అయితే ధ్రువప్రాంతపు సీలు జంతువు శీతాకాలపు దీర్ఘసుషుప్తిలోంచి లేచి వచ్చినట్టుగా నీకు నువ్వే కొత్త.

ఠంగ్... ఠంగ్... గంట మోగింది. సీతాకోక చిలుకలు, తూనీగలు, ముద్దొచ్చే తెల్లకుందేళ్లు మెట్లెక్కుతున్నాయి. మధూకు ఎన్ని డ్రెస్సులో! పూటకొక డ్రెస్సు మారుస్తుంది. అది ఏ డ్రెస్సు వేసుకున్నా అందంగా వుంటుంది. ఇప్పుడు అది లేసులల్లిన పింక్ కలర్ స్కర్టు, పైన ముదురు ఊదారంగు టాప్ వేసుకుంది. కొట్టొచ్చినట్టుగా మెరుస్తోంది. ఎంబ్రాయిడరీ! రెబెక్కా జీన్ ప్యాంటూ, లేత పసుప్పచ్చ టీషర్టు ధరించింది. దానికి జీన్స్ లేదా కుర్తాలే నప్పుతాయి.

వాళ్లు ఆగారు. బాటవేపు దృష్టి సారిస్తున్నారు. ఇంకెవరి కోసం? రెండు రోజుల నుండి స్నేహితురాలు కాలేజికి రాకపోతే ఆదుర్దాగానే వుంటుంది వాళ్లకు. పాఠాలు, ప్రాక్టికల్స్ మిస్ అవుతూంటే నీకూ ఆందోళనగానే వుంది. ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఆఖరి అధ్యాయం- టర్పెంటాయిడ్స్, స్టెరాయిడ్స్ అయిపోయుంటుంది. కెమిస్ట్రీలో పర్మాంగనోమెట్రీ, ఫిజిక్సులో రిఫ్రాక్టివ్ ఇండెక్స్ ఆఫ్ ప్రిజమ్ ప్రయోగాలూ అయిపోయాయేమో? రెబెక్కా ప్రాక్టికల్స్ పుస్తకం నీ దగ్గరే ఉండిపోయింది.

అది ఎంత తిట్టుకుందో- అదిగో నమిలి మింగేద్దా మన్నంత కోపంగా చూస్తోంది!

పద. గబగబ నడువు. స్నేహితురాళ్ల కళ్లల్లో చురుక్కుమనేంత మెరుపు. పెదాల మీద మార్మికమైన చిరునవ్వులు. ఈ రెండురోజులు ఏ కబురూ లేకుండా ఏమయ్యావే అనడుగుతారు. ఏం చెప్పాలి? గుండెలో దడ. ఉద్వేగం.

అనంతమైన కాలప్రవాహంలో నలభై ఎనిమిది గంటలు పరిగణనలోకి రాని పరిచ్ఛేదమే కావచ్చు. ఈ స్వల్పాతిస్వల్పకాలమే నీ నూరేళ్ల జీవితంలో అప్పుడే నలభై ఎనిమిదేళ్ల అభౌతిక సారాన్ని ప్రవేశపెట్టింది. సెంటిమెంటుల ఊబిలోకి కూరుకుపోకుండా ఉండేం దుగ్గాను నిన్ను నీవు మానసిక దిగ్బంధనం చేసుకుని, బాహిర్లోకం నుండి దూరంగా గుండె లోలోతులకు వెళ్లి, ఆశయాల, లక్ష్యాల దివిటీ వెలుగులో తర్కించుకుని, వితర్కించుకుని భవిష్యత్ జీవితపు బంతిని స్వంత చేతుల్లోకి తీసుకోవడానికి ఈ తక్కువ వ్యవధిలో ఎంతటి ఉద్రిక్తతకు లోనయ్యావ్!

రెబెక్కా ఆప్యాయంగా భుజానికి భుజం రాసింది. "ఏమయింది నీకు? మేమెంత పరేషాన్ అయ్యామో తెలుసా?"

మౌనంగా నవ్వడమే. ఇప్పుడేమని చెప్పడం?

"...పరీక్షలు దగ్గరపడ్డాయ్. ఉన్నట్టుండి మాయ మయ్యావ్. సంగతి కనుక్కుందామని ఎన్నిసార్లు ఫోను చేశానో! మీ ఫోను డెడ్. స్వయంగా వచ్చి కలుద్దామంటే- మీ ఇల్లు భూగోళం ఆవలి చెరుగున ఉన్నదాయె. సరి సరి... వాటీజ్ యువర్ ప్రాబ్లెం? మూడురోజుల ఇబ్బంది ఏమన్నా ఎక్సెస్ అయిందా?"

ఆ ఇబ్బంది కాదు. ప్రమాదం వెంట్రుకవాసిలో తప్పిపోయింది. నీ బాధ కుటుంబానికి బాధయి, ప్రపంచానికి బాధయి, నివారణగా నీ ప్రమేయం లేకుం డానే నీ జీవితం చేజారిపోబోయింది. అంతే.

మధూలిక భుజాలు పట్టి కుదిపేసింది. ముఖం లోకి ముఖం పెట్టి చూస్తూ, "యూ ఆర్ ఆల్‌రైట్. కానీ కళ్లల్లో లీలామాత్రంగా నీలికాంతి. ఏమిటే రేఖా, అమ్మమ్మలా మూతి ముడిచావ్. కొంపదీసి మీవాళ్లు నీకు పెళ్లి ప్రయత్నాలుగానీ చేస్తున్నారా..." అని పకపక నవ్వింది.

దీనికెప్పుడూ హాస్యమే. అన్నీ తేలికగా తీసు కుంటుంది. ఆఫ్‌కోర్స్ నీది అందరూ గుండెలు బాదుకోవాల్సినంత గంభీర సమస్య అయితే కాదు. వీళ్లకు చెప్పకూడని రహస్యమూ కాదు. భావోద్విగ్నత అసహనంగా పరిణామం చెందింది. "షిట్. ఎందుకు నన్నిలా వేధిస్తున్నారు? గెట్ ఎవే. క్లాసులోకి పోనీయండి నన్ను..."

"సారీ..." అంది రెబెక్కా. "బట్ అయాం హియర్ టు ఎంపథైజ్ విత్ యు," బాడీగార్డులా అడుగులో అడుగేస్తూ మెట్లెక్కుతోంది.

ఆఖరి మెట్టు అధిగమించబడింది. నున్నటి కలువరాతి గద్దె మీద తెల్లని సింహం. దాని కేసరాల మీద ఎరుపుఛాయ. స్ఫింక్స్! కనకాంబరం రంగు వెంకట గిరి కాటన్ చీరలో నిలబడి వున్న ప్రిన్సిపల్ గరిమాదేవి నిశ్చలమైన చూపుల్లో ప్రశ్న వేలాడుతోంది.

స్ఫింక్స్ అడిగిన ప్రశ్నలకు గ్రీకు పురాణవీరులు సమాధానమివ్వలేకపోయారు. యక్షుడు అడిగిన ప్రశ్న లకూ పాండవులు సరియైన జవాబు చెప్పలేకపోయా రట. అది గతచరిత్ర. నడుస్తున్న చరిత్రలో ఆధునిక యువతి ఎలాంటి సమస్యనైనా సునాయాసంగా పరిష్క రించగలదు.

"ఏమీలేదు మేడం. పిచ్చికుక్క కరచింది అంతే." స్థిరమైన గొంతు నుండి చెప్పలేనంత అనాయాసంగా వెలువడిన ముక్తసరి జవాబు.

"వ్యాధి నిరోధక వాక్సీను తీసుకున్నావా?"

"ఆ భయమేమీ లేదు మేడం".

అసంతృప్తి భృకుటిని ముడచి, ప్రశ్నార్థకాన్ని పెద్దది చేసింది. "రేఖా, ఆఫీసులోకి రా. వివరాలు కావాలి," ఆహార్యం భారతీయమైనా హావభావాలు ఎలిజబెత్‌రాణివి. మాట్లాడే ఇంగ్లీషు భాష స్వచ్ఛత విక్టోరియా యుగానిది. గొంతులోని మార్దవం దేశ కాలాలకతీతమైనది.

దాచేస్తే దాగని సత్యం. చీకటి కోణంలోంచి వెలికి తీయాలి. ఇప్పుడు కావాల్సింది సమాజం మారడం. "యస్ మేడం చెబుతాను."

*

బెడ్‌రూమ్ మంచు గుహలా వుంది. బయట పరిసరాలపైన సుదీర్ఘమైన రాత్రి పరిచిన చీకటి పొరలు ఇంకా విచ్చుకోలేదు. దాహం అంతరాంతరాలలో ఆవేశం, ఆవేదన, ఆక్రోశాలు ఇంధనంగా మండుతున్న బడబానలం. "అమ్మా, మంచినీళ్లు..."

క్షణాలు, నిమిషాలు దొర్లిపోయినై. ఇంట్లో ఎవరూలేరా? ఉహు లే. కదులు. కిచెన్‌లోకి పద. పూర్తి ఆరోగ్యంగా ఉన్నావ్. అయినా అడుగులు బరువుగా పడుతున్నాయి. ఇంట్లోని వాతావరణం నమ్మశక్యం కానంత కొత్తగా, భయం గొల్పేటంత నిశ్శబ్దంగా వుంది.

దైనందిన చర్యలకూ, వ్యక్తులకూ, వస్తువులకూ, ఇంటి ఆత్మకూ మధ్య వుండాల్సిన లంకె తెగిపోయింది. ముందు గదిలో టీవీలో స్టార్ ఛానెల్ ప్రోగ్రాముల మోత. వంటగదిలో గిన్నెల టకటకలు, మిక్సీ గరగరలు, అమ్మ చిరుకోపపు మందలింపులు; స్టడీ రూములోని టేబిల్ లాంపు కింది పుస్తకాల దొంతరల్లోంచి 'రేఖా, టిఫినూ కాఫీ త్వరగా... ఇక్కడికే తీసుకురా,' అనే అన్నయ్య తొందరింపులు; బయట హాల్లో రాకింగ్ కుర్చీ కిర్రులు, నాన్న చేతుల్లోని దినపత్రిక రెపరెపలు, ''టీవీ కట్టెయ్యరా, ఏదీ నీ హోంవర్కు ఇలా పట్రా,' అనే తమ్ముడిని ఉద్దేశించిన ఆయన ఆదేశాలు- ఇవేవీ విన్పించడం లేదు. పెరట్లోని తులసికోట దగ్గర మాత్రం క్రమం తప్పని క్రతువు- నానమ్మ పూజ చేస్తూ చదువు తున్న మంత్రాలు, శ్లోకాలు తెగిపోయిన వీణ తీగల మూర్ఛనల్లా శబ్దిస్తున్నాయి.

పెరటి గుమ్మం వద్ద అమ్మ, గడపలో అలుకు పిడుచలా కూలపడింది. తల పైకెత్తి మబ్బుల వేపు శూన్యంలోకి చూస్తోంది. ఆకాశంలో సగానికే అనాదిగా ఈ బాధలు దాపురిస్తున్నాయెందుకో అని తలపోస్తూ లోలోన కుమిలిపోతున్నట్లుంది. అడుగుల సవ్వడి విని చూపులు మరల్చింది. ''నాన్నగారేమన్నారు? వెళ్లు. గదిలో నుండి కదలొద్దు.''

ఎంతయినా త్రిదశల్లో ఆలంబన విధించబడ్డ జాతికి ప్రతినిధి కదా అమ్మ! అపరాధభావన. ఆత్మ గౌరవం, రోషం, పరువు ప్రతిష్ఠల భయం, సాంఘిక కళంకపు జంకు- ఇవన్నీ మస్తిష్కంలో ఏకకాలంలో పెనుగొన్నప్పుడు నిర్ణయం తీసుకోలేని నిస్సహాయత అనురాగాన్ని తాత్కాలికంగా పక్కకు నెట్టి పదాలకు కాఠిన్యం పులిమింది.

నీళ్లోడుతున్న గుడ్డలతో పూజామందిరంలోకీ, వంటగదిలోకీ నడుస్తూ నానమ్మ అష్టావధానం చేస్తోంది. శ్లోకాలు చదువుతూ, మాట్లాడుతూ మంచినీళ్ల గ్లాసు అందించింది.

''రాజ్యం! ఏవిటే, పిల్లను ఝడిపిస్తావ్? కట్టు బాట్లు సడలించి, చదువూ సమానత్వం అంటూ అప్పుడు ఆడపిల్లను వదిలేసి ఇప్పుడు కొడితే, తిడితే, ఏడిస్తే ప్రయోజనమేముంది? అంతా మన ఖర్మ... సహస్ర శీర్షం దేవం విశ్వాక్షమ్ విశ్వశంభువం విశ్వం నారాయణం దేవ అక్షరం పరమం పదం... ఇదంతా సుకృతం. అదే పాపం... పాపాగ్నిజ్వాల... విశ్వతః పరమా న్నిత్యం...''

నీళ్లు తాగి అమ్మ తొడ మీద విశ్రమిస్తే హాయిగా వుంది. అప్రయత్నంగా అమ్మ చల్లని చేయి తల మీద పడి నిమురుతోంది. కానీ నీ గలీజు దుస్తులు నీకే జుగుప్సాకరంగా, నీ వొళ్లు నీకే అసహ్యంగా వున్నాయి. షిట్.

నానమ్మ గొణుగుతోంది. చదువుతోంది. మంత్ర పుష్పం నుండి శ్రీసూక్తంలోకి మళ్లింది. ఆమెకు ఉపని షత్కథలు, పురాణేతిహాసాల గాథలు బాగా తెలుసు. 'ఈ కాలపు పిల్లలకు సైన్సు, ఇంగ్లీషు, లెక్కలు తప్ప ఇంకేమీ తెలియదు. చరిత్ర పరిజ్ఞానం బొత్తిగా శూన్యం,' అంటుంది. మధ్యయుగాల నాటి దేశ పరిస్థితులు, నైజాం కాలంలోని రజాకార్ల వ్యతిరేక ఉద్యమాల గురించి చక్కగా మాంత్రిక వాస్తవిక ధోరణిలో వర్ణి స్తుంది. అప్పుడప్పుడు తలంటు స్నానం పోస్తున్నప్పుడూ, పండగలప్పుడు సాంప్రదాయికంగా ముస్తాబు చేస్తు న్నప్పుడూ మనవరాలి వొళ్లంత తడిమి, చెంపల్ని పుణికి ముద్దాడి, 'నువు పద్మినీజాతి ఆడదానివే,' అంటుంది.

'పద్మినీజాతి స్త్రీ లక్షణాలేమిటి నానమ్మా,' అని అడిగితే ముసిముసిగా నవ్వుతుంది. స్త్రీల రంగు, రూపు, రేఖల్ని బట్టి నాలుగు జాతులుగా వర్గీకరించారట ప్రాచీన ఋషులు. ముసలమ్మ సంస్కృత శ్లోకాలు, పురాతన పద్యాలు ఉటంకిస్తూ వాటి టీకాలు వివరిస్తూ వినేవాళ్లు సిగ్గుతో చచ్చేలా అంగాంగ వర్ణన చేస్తుంది.

'నానమ్మా, నీకు ఇన్నిన్ని విషయాలు ఎలా తెలుసే...' అని ప్రశ్నించినప్పుడు, ఆమె కొన్ని క్షణాలు గతస్మృతుల్లోకి జారిపోయి ఊహాలోకంలో విహరిస్తుంది.

''మీ తాతగారు, అబ్బో ఆయనో రసికప్రియుడు లేవే. బోలెడు పుస్తకాలతో ఇంట్లో చిన్న గ్రంథాలయమే పెట్టాడు. జల్సాగా తిరిగే గుణమే అయినా ఇంటిపట్టున ఉన్నప్పుడు దీర్ఘంగా చదివేవాడు వాటిని. అదురుష్టం, ఆయన బుద్ధులు నా పిల్లలకు రాలేదు...''

''సర్వమంగళ మాంగళ్యే, శివే సర్వార్థసాధికే శరణ్యేత్ర్యంబకే...'' ఘనాపాటిలా చదువుతోంది నానమ్మ. బాగా మగ్గిపోయిన మామిడిపండు వంటి ముఖంలో సోడాబుడ్డి కళ్లద్దాలు. నడుం వంగిన పొడువాటి దేహమ్మీద నారబట్టల్లాంటి మడివలువలు. గొంతులో పళ్లు లేకపోయినా వినదగ్గ శ్రావ్యత. యవ్వ నంలో మంచి అందగత్తె అయివుండాలి ముసలమ్మ. మరి తాతయ్య మన్మథలీలల్ని ఎలా సాగనిచ్చిందో...

గతకాలపు వివరాలు అడిగిందే తడవుగా మహో త్సాహంతో చెప్పుకుపోతుంది. ''నానమ్మా... ఆ తిరుకోవెల నారాయణమ్మ నీకన్నా అందంగా ఉండేదా?''

"సమయమూ, సందర్భమూ లేకుండా ఏమిటా మాటలు? మిన్నువిరిగి మీదపడి మేమంతా ఏడుస్తుంటే నువు చిన్నపిల్లలా ప్రవర్తిస్తావేమిటి..." అమ్మ గద్దిస్తోంది. "లోపలికెళ్లు. బయటికి రాకు."

నానమ్మ హారతి వెలిగిస్తూ తాపీగా చెప్పుకుంటూ పోతోంది. "నారాయణమ్మను ఒకసారి చూస్తే ఇంకెప్పుడూ మర్చిపోలేరు. అలాంటి రూపం దానిది. అపుడు పసుపు, చందనం, నలుగు, మైదాకు, దోసకాయ రసం, కుంకుడుకాయ... వగైరాలే మా సౌందర్య సాధనాలు. ఒకసారేమయిందంటే- దేశాయిగారి గడీలో బతుకమ్మ ఆడారు. గోలకొండ నుండి సుబేదార్ వచ్చాడు. మీ తాతగారి పర్యవేక్షణలో..."

"అదిసరే. ఆ గాథ అలా వుండనీ. అంత అందమైన నారాయణమ్మకు తగిన మొగుడు దొరికాడా?"

నానమ్మ గొంతు తడబడింది. ముఖం మ్లానమైంది. దీర్ఘమైన నిట్టూర్పు ఒకటి నిగ్గడించి అంది. "దానికి పెళ్లి కాలేదు. మరియమ్మ అయింది. లోకానికి భయపడింది. చెరువులో శవమై తేలింది... ప్రాయశ్చిత్తం చేసుకునే అవకాశంలేకుండాపోయింది మీ తాతయ్యకు. పక్షవాతం కమ్మేసింది. అదే పాపం... ఆ శాపమే ఇలా దహిస్తున్నట్టుంది..."

స్టడీ రూము నుండి ముందు గదిలోకి అటుఇటు నిప్పులు చెరిగే ఎండలో చెప్పుల్లేని పాదాల మీద పచార్లు చేస్తున్న అన్నయ్య విసురుగా వచ్చాడు. "ముసలమ్మా, నీ చాదస్తపు వాగుడు కట్టిపెట్టు. దానికి కాకమ్మ కథలు, బాలనాగమ్మ కథలు, పద్మినీ పురాణాలు ఇప్పుడు చెప్పావంటే నీ పీక నొక్కేస్తాను," కోపంగా గర్జించి గబగబా దుస్తులు వేసుకుని చెప్పుల్లోకి కాళ్లు పోనిచ్చాడు. "నా వంట్లోని చీమూ, నెత్తురూ పరిహసిస్తున్నాయ్. నేను చేతులు ముడుచుకు కూర్చోలేను. ఇవాళ ఈ వీధిలోని కాలువల్లో నెత్తురు ప్రవహించాల్సిందే..."

సాధారణంగా ఈఎస్పీయన్‌లో క్రీడలు తన్మయంగా చూస్తూండాల్సిన తమ్ముడు ఈవేళ అలవాటు తప్పి జామిచెట్టు కింద హాకీ స్టిక్కుతో విన్యాసాలు చేస్తున్నాడు. అన్నయ్య ముఖంలోని కవళికల్ని చూసి, ఏదో జరిగి వుంటుందన్న విషయం చిట్టి బుర్ర ద్వారా ఊహించి అజ్ఞాతవ్యక్తి మీద ఉత్తుత్తి ప్రతీకారం తీర్చుకుంటూ స్టిక్కును ఉద్ధృతంగా ఝుళిపిస్తున్నాడు.

"ఒరేయ్ మూర్తీ, ఆగరా," గగ్గోలుగా అరిచింది అమ్మ. "నాన్నగారి మాట ఉల్లంఘిస్తావా? నువు మామయ్య కంటే ఎక్కువ తెలివిమంతుడవా? నువ్వు ఎన్ని బియ్యేలు, ఎమ్మేలు చదివినా లోకాన్ని అర్థం చేసుకుంది వాళ్లకంటే తక్కువే. దుడుకుగా ప్రవర్తించకు. గుట్టురట్టు చెయ్యకు. గడపదాటితే నా మీద వొట్టే..." తల బాదుకుంది అమ్మ.

కుర్చీలో కూలబడ్డాడు అన్నయ్య. సర్వీసు కమీషన్ పరీక్షలు రాసినంత సులభంగా, కాంపిటీషన్ ఇంటర్వ్యూలు గట్టెక్కినంత తేలికగా ఇంట్లో తలెత్తిన పరిస్థితినీ, దాని ప్రభావాన్నీ బేరీజు వేయడం సాధ్యం కాదనుకుంటున్నాడా? ద్రవ్యోల్బణం, సరళీకృత విధానాల పరిణామాలు, ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిం తర్వాత ప్రపంచం తీరుతెన్నులు, యుగోస్లేవియా అంతర్యుద్ధం వగైరాల్ని విశ్లేషిస్తూ అనర్గళంగా మాట్లాడే అన్నయ్య ఇక నోరు మెదపలేడు. మేధస్సును మరిగిస్తూ తీవ్రమైన మీమాంసలో పడ్డట్టున్నాడు.

"నిర్వాకం చాలు. కట్టకట్టుకుని చావాల్సిన స్థితి. బెడ్‌రూమ్‌లోకి వెళ్లు. ఫో... ఫో..."

మింగలేని, కక్కలేని ఉక్రోషం. మిలటరీ క్రమశిక్షణ, మధ్యతరగతి కుటుంబాల గుడుగుడుగుంచం... గుండేరాగం. నాన్న నుండి అమ్మకు, అమ్మ నుంచి పిన్నలకు ఆజ్ఞలు జారీ అవుతాయి. పితృస్వామ్య వ్యవస్థ యూనిట్ పెద్దగా నాన్న ఈవేళ అందరికీ ఉమ్మడిగా ఉత్తర్వులిచ్చి మామయ్య వద్దకు వెళ్లాడు. వాళ్లొచ్చేదాకా అంతా గప్‌చుప్...

అరుగు మీద అస్పృశ్యంగా పడివున్న దినపత్రిక పుచ్చుకొని జైల్లోకి పద. కాలయాపన ఉద్దేశపూర్వక నరకయాతన కొనసాగింపు. అర్థంలేని నిరవధిక నిరీక్షణ. గుండెల్లో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నా అదిమిపెట్టే ప్రయత్నమెందుకో... రేగే తుపానుని ఆపేందుకు ప్రయాసపడుతున్న కారణమేమిటో... వెల్లువలా ఉరకలెత్తాల్సిన ప్రతిస్పందన అతి జాగ్రత్తగా సమష్టికృషితో దారి మళ్లించబడుతోంది. సందేహంలేదు. వీళ్ల ఆలోచనలు మరో కోణంలోంచి, మరో దిశగా సాగుతున్నాయి. ఎటువేపు?

మంచుపొరలు విచ్చుకున్నాయి. బయట వెచ్చగా ఎండపొడ ప్రవహిస్తోంది. మార్మికభావాలు దట్టంగా అల్లుకుపోయిన ఇంట్లో బెడ్‌రూం ఇంకా శీతలంగానే వుంది.

'పార్లమెంటును మరోమారు కుదిపేసిన టెలికాం కుంభకోణం', 'భారత్ అణుపరీక్షలకు అమెరికా ఆంక్షలు'... షిట్. ఎవడిక్కావాలి ఈ పేపర్. పక్కన పడేయ్. టేబిల్ మీద పాఠ్యపుస్తకాలు. ఇంగ్లీషు టెక్స్ట్ బుక్ చేతుల్లోకి వచ్చింది. 'సీతా', 'ది బాంగిల్ సెల్లర్స్', 'లూసీగ్రే', 'హోపీమాన్'... పేజీలు తిప్పేసేయ్. 'ప్రొఫెషన్స్

ఫర్ ది వుమన్!' ఆగు. వర్జీనియా వుల్ఫ్ పాఠం ఎంత చక్కగా వుంది! ఇంగ్లీషు మేడం ఇవాళ పరీక్షల కోసం ఈ పాఠాన్ని సంగ్రహీకరించి రాయిస్తానంది. స్త్రీకి స్వేచ్ఛ. అది ఆర్థిక స్వాతంత్ర్యం తోటే సాధ్యమవుతుంది. ఆధునిక స్త్రీ ఎదురుగా అసంఖ్యాకమైన వృత్తులు, ఉపాధులు, నచ్చిన మార్గం వెంట నిర్భయంగా సాగిపో. ముందుగా బుర్రలోని ఆ ఫాంటమ్‌ని చంపెయ్యి. ఏమిటా ఫాంటమ్? నీలోని ఆత్మన్యూనతా భావమే. ఆడదాన్ని, అబలను అన్న పిరికి ఆలోచనే. నిర్దాక్షిణ్యంగా చంపెసెయ్యి దాన్ని. యస్.

బయట స్కూటర్ చప్పుడు. నాన్న మామయ్యను తొడ్కొని వచ్చేశాడన్న మాట. మెత్తగా అడుగుల చప్పుడు. అందరూ ముందు గదిలో సమావేశమవుతున్నారు. నువు తప్ప.

"మూర్తీ తలుపులు దగ్గరగా మూసెయ్యి."

ఇక మామయ్య నిర్దేశకత్వం ప్రారంభమయింది. ఆయన విద్యాశాఖలో గెజిటెడ్ ఆఫీసరు. వయసులో నాన్న కంటే ఏడేళ్లు పెద్దట. అంతస్తూ, హోదా, లోకానుభవంలో కూడా. కీలకమైన నిర్ణయాలప్పుడు ఆయన సలహా శిరోధార్యం ఇంట్లో వాళ్లకు. అమ్మ మాటల్లో చెప్పాలంటే ఆమె అన్నయ్య ఘనతలు ఇవి. ఆంధ్రదేశంలో అన్ని ప్రాంతాలు తిరిగాడు. ఇద్దరు కూతుళ్లకూ ఘనమైన మొగుళ్లను తెచ్చాడు. నగరం నడిబొడ్డున పెద్ద యిల్లు కట్టాడు.

"రాజ్యం, నువు ఏడవకు. పిల్లని బెంబేలుపెట్టకు. దారినపోయే పిచ్చికుక్క కరిచిందనుకో. రేఖకు నచ్చ జెప్పు. అయితే-" ఆగాడు మామయ్య. సస్పెన్స్. "అయితే బావా, కాలమలా తగలబడింది. మరి, ఏం జేద్దాం! కుటుంబ గౌరవానికి సంబంధించిన విషయ మిది. గిన్నెలోని పొంగు గిన్నెలోనే వుండాలంటే, ఇదే మార్గం. పెళ్లి ప్రస్తావన పరోక్షంగా మీటి చూస్తాను. వాళ్లు సానుకూలంగా ప్రతిస్పందిస్తే సరి... లేకపోతే- ఏరా మూర్తీ ఏమంటావు?"

"మన ప్రస్తావన మూలంగా వాళ్లు దురాశతో లబ్ధి పొందాలని చూస్తే...? ఏదేమైనా రేఖ అభిప్రాయం తెలుసుకోవాలి..."

"మీది యువరక్తం. మీ ఆలోచనాధోరణి వేరేలా వుంటుందని నాకు తెలుసు. అయితే నేను లోకానుభవ మ్మీద చెబుతున్నాను విను. ఒకసారి చట్టాన్ని ఆశ్రయిస్తే తరువాత ఒనగూడే క్షోభ తట్టుకోవడం మనవల్ల కాదు."

మౌనం. అంతా మౌనం. నువు కూడానా? షిట్. నిన్ను మనసులేని మరబొమ్మ అనుకుంటున్నారేమో. అణువణువునా ఆగ్రహం, ద్వేషం రగులుతున్నప్పుడు ఈ అర్థంలేని రాజీ ఏమిటి? పురుషాధిక్య సమాజంలో ఆడదాని పట్ల జరిగిన అన్యాయానికి పురుషకోణంలో నుండే విచారణ జరిగి, పురుష స్వభావం నుండే తీర్పు ఇవ్వబడుతోంది. పూర్వకాలంలో ఒక వ్యక్తి ఒక వనితను బలాత్కారంగా పెళ్లాడితే దాన్ని రాక్షస వివాహమనే వారట. ఇది వ్యక్తులు జరిపించాలనుకుంటున్న రాక్షస వివాహం! షిట్. నీ జీవితంపైన నీకు గల హక్కును గొంతు పగిలేలా చాటింపు వెయ్యి. గెటప్.

"నాన్నా, ఆధునిక యుగంలో ఆటవిక న్యాయం చెల్లుబాటు కాజాలదు. మామయ్యా, మీరు కాలం వెంట పరుగెత్తే మనుషులు. నేను కాలాన్ని నా వెంట పరిగెత్తేలా చేస్తాను. అన్నయ్యా, నువ్వు నాతోపాటు ముందుకు నడుస్తావా లేక వయసు మళ్లిన తరం..." అన్నయ్య దిగ్గునలేచి తలుపు గడియలాగాడు. ఎదురుగా విశాల విశ్వం.

*

చలిగాలి రివ్వుమని వీస్తూ మంచు సూదుల్ని శరీరంపైకి విసురుతోంది. ఆకాశం ధమ్మిల్లంలో దశమి నాటి చంద్రుడు నగరంపై వ్యర్థంగా వెలుగుతూ రాత్రి పాలిటి మోయలేని కంఠాభరణంగా వేలాడుతున్నాడు. పొగమంచు జలతారు ముసుగులో హర్మ్యాలు, పరి సరాలు విశాలమైన కాన్వాసు మీద చిత్రించిన సర్రియ లిస్టు పెయింటింగుల్లా వున్నాయి.

చలి మరోసారి గుప్పెడు సూదుల్ని ముఖానికేసి కొట్టింది. అబ్బ... నిజంగానే అదరగొడుతోంది. చలి... నానమ్మ అన్ని కాలాల్లోనూ చన్నీళ్ల స్నానమే. ఈ చలిలో గడ్డకట్టుకుపోదూ? ఆ మాటే అంటే నిర్వికారంగా నవ్వు తుంది. 'ఎన్నో అనుభవాలు గడించి రాటుదేలిన కాయమే నాది. మీరు వట్టి బ్రాయిలర్ కోడిపిల్లలు. దేనికీ తట్టుకోలేరు,' అంటుంది. షిట్. అది ఎప్పుడూ గతకాలంలోనే వైభవాన్ని వెతుకుతుంది. ఈ తరం యువత అంటే అంత చులకనా? రెండు రౌండ్లు జాగింగ్ చేస్తే చలి ఉఫ్‌మని ఎగిరిపోతుంది.

"ఈ వొక్కరోజు జాగింగ్ మానేస్తే కొంపలేవీ అంటుకుపోవు. వాకింగ్ అయిపోయిందిగా... చాలు పద వెనక్కి..."

ఇప్పుడిప్పుడే లతలా ఎదుగుతున్న ఉత్సాహానికి మొగ్గ తొడుగుతున్న ఆరోగ్యస్పృహకు అంటకత్తెర వేసేలా ఉన్నాడు అన్నయ్య. కానీ ఏం చేస్తాడు పాపం. కాలిమడమ నొప్పి ఎక్కువయినట్టుంది. కాలు అలా లేవనెత్తాడేమిటి- పెద్ద గంతు. కిత్‌కిత్ బిళ్ల. కుంటికాలు...

"నీకు ట్రబుల్ అనిపిస్తుంటే సారీ అన్నయ్యా! నేనొక్కదాన్నే అలా వెళ్లి..."

ఉహు ఆ కళ్లల్లో సంకోచం, అసమ్మతి- రెండింటి మిశ్రమం. ఒప్పుకునేలా లేడు. ఈరోజు తప్పితే... రేపు బద్ధకం. లాలిమ్లీ బ్లాంకెట్ ముసుగులో ఏడున్నరదాకా నిద్రపోయే పాత అలవాటు మళ్లీ కబళిస్తుంది. లక్ష్యం దెబ్బతింటుంది. వొళ్లును స్లిమ్ అండ్ స్లీక్‌గా మలచాలి. ఆ మధూలిక ఇడియట్- తనో మోడల్ అవబోతున్నట్టు కలలు కంటుంది. 'రేఖ- అలియాస్ జూనియర్ టున్ టునం,' అని తరచూ గేలి చేస్తుంటుంది. దాని గంపెడంత నోటికి తాళం వెయ్యాలి... యస్.

"అన్నయ్యా, నువ్వే కద నా ప్రోగ్రెస్ బాగున్న దన్నావ్! ఇలా ఆపేస్తూ పోతే క్లాసులో నిద్దరోతానేమో మళ్లీ..."

గుడ్ అన్నయ్య చెవిలో పువ్వెట్టావ్. 'ఓ అన్నా నీ అనురాగం, ఎన్నో జన్మల పుణ్యఫలం... ఓ అన్నా...' అప్రయత్నంగా వచ్చింది హమ్మింగ్. అమ్మకెంత ఇష్టమో ఈ పాటంటే! రాఖీ పండగనాడు టేపు రికార్డరులో రోజంతా ఈ పాటే మోగించమని తమ్ముడికి ఆదేశ మిస్తుంది. 'ఈ సుత్తిపాట ఏమిటమ్మా,' అని వాడు విసుక్కుంటాడు. ఆ లిటిల్ రాస్కెల్‌కి 'తుఝే దేఖాతో యె జానాసనమ్,' పాట వినాలనుంటుంది.

అన్నయ్య ముఖకవళికలు మారినై. "సరే వెళ్లు. జాగ్రత్త. చిల్డ్రన్స్ పార్కు చుట్టూ ఒక్క రౌండు వేసి తిన్నగా వెనక్కొచ్చేసేయ్."

"మరి నువు ఈ చలిలో..."

"ఫరవాలేదు. కాసేపట్లో పేపర్ కుర్రాడు వస్తాడు. పేపరు చదువుకుంటూ ఈ సిమెంటు బెంచీ మీద కూర్చుంటాను," అంటూ వార్మింగప్ కసరత్తులు మొదలెట్టాడు. కుంటికాలుతో కుప్పిగంతుల అవస్థ. పిలియనుగా కూర్చున్న ఈయన స్కూటర్ నడుపుతున్న స్నేహితుని చెవి దగ్గర కంపూచియా రాజకీయ పరిస్థితుల గురించో లేక అర్జెంటైనా ఆర్థికవ్యవస్థ మీదనో ఫుల్‌స్టాపులు, కామాలు లేని ఉపన్యాసం ఇచ్చి వుంటాడు. ఆఫీసు నుండి అలిసి వస్తూన్న ఆయన అన్యమనస్కత పెంచి వుంటాడు. తత్ఫలితంగానే స్కూటర్ స్కిడ్ కావడమూ, ఇద్దరికీ దెబ్బలు తగలడమూ జరిగి వుండాలి. నయం- అన్నయ్యకు చీలమండ దగ్గర చిన్న గాయం మాత్రమే. పాపం, ఆ ఫ్రెండ్ చెయ్యి ఫ్రాక్చరయి హాస్పిటల్లో ఉన్నాడట.

కమాన్, రోడ్డంతా మనదే. పరుగెత్తు, గెంతు, పల్టీలు కొట్టు, సోడియం వేపర్ దీపాల వెలుగులో- తిన్నగా సాగిన తారురోడ్డు నాచురంగు పట్టుచీరలా మెరుస్తోంది. కమాన్, జాగ్, వన్, టు, త్రీ...

"త్వరగా తిరిగి రావాలి..."

"అలాగే వస్తాను."

"నెమ్మదిగా ప్రారంభించు జాగింగ్. క్రమంగా వేగం పెంచు. డోన్ట్‌బి హర్రీ. ఆత్రపడితే కీళ్లనొప్పులు. మజిల్ క్రాంప్ అర్థమైందా? పార్కు చుట్టూ రెండున్నర కిలోమీటర్లు. చాలు, యూకలిప్టస్ తోట దిశగా వెళ్లకు. చీకటి, పిచ్చి కుక్కలుంటాయి జాగ్రత్త..."

అబ్బబ్బ సొద... చెవులు మూసుకోవాలి. నానమ్మ చాదస్తపు వారసత్వం పూర్తిగా పుచ్చుకున్నట్టున్నాడు నీ సహోదరుడు. సిరా మరకల చెయ్యి నోట్లో పెట్టుకోవద్దు బాబూ- కదిలే బస్సులో తల బైటికి పెట్టవద్దు పిల్లా- చేతులు లోపలికి తీసుకో బేబీ... షిట్, ఇంకేమయినా వుందా సుభాషిత రత్నావళి మిగతా భాగం?

ఇంకొంచెం వేగం, శరీరంలో ఎంతాల్పీ పెరుగుతోంది. చలి పారిపోతోంది. గత ఆదివారం రెబెక్కా ఫోనులో మాట్లాడుతూ 'స్పీడ్' సిన్మాకి వెళ్దాం రావే అంది. "వ్వాహ్... ఆడపిల్లలు ఆంగ్రేజీ సిన్మాలు చూస్తారా," అని బుగ్గలు నొక్కుకుంది నానమ్మ. 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' ఎవడ్రా అన్నది? వాడి గెడ్డం పీకి పొయ్యిలో వెయ్యాలి!

'అంబేద్కర్ చిల్డ్రన్స్ పార్క్' బోర్డు. చతురస్రంలో ఒక పక్క అయిపోయింది. లెఫ్ట్ టర్న్. చౌరస్తాలో బాంకుకు ఎదురుగా కొత్తగా రిలీజయిన ఇంగ్లీషు సిన్మా హోర్డింగ్. ఇంగ్లీషు 'ఎ' అక్షరంలాగా అర్థనగ్న తొడలు; వాలిన 'వి' ఆకారంలో ఆడ, మగల నగ్న శరీరాలు. కనుల పండగలా ఉందేమో... నైటు డ్యూటీ దిగిన బీట్ కానిస్టేబుల్ హోర్డింగ్ ముందు సైనిక వందనం చేస్తున్నాడు.

'శిరోజాల సౌందర్యం, చర్మపు లావణ్యం, వంపు సొంపుల ఆకర్షణీయత ఈ మూడు కొలతల గాజు పేటికలో స్త్రీ తన్నుతాను బందీ చేసుకుంటున్నది. సెక్స్ అబ్జక్టుగా, కమర్షియల్ ట్రేడు మార్కుగా ఉండేందుకే ఇష్టపడుతోంది. సోకాల్డ్- విమెన్స మాగజైన్ల గ్లాసీ పేజీల్లో సైతం ఈ ధోరణికే ప్రోత్సాహం ఇవ్వబడుతోంది. ఇది మారాలి,' అంటుంది రెబెక్కా. దాని మాటలు విచిత్రంగా వుంటాయి. అయితే ఆలోచించి చూస్తే ఆ మాటలు సబబుగానే తోస్తాయి.

ఒకసారి సిటీబస్సులో ఓ తుంటరిగాడ్ని బలే అదరగొట్టింది రెబెక్కా. సిటీ బస్సు సడెన్‌బ్రేక్‌తో ఆగినప్పుడు ప్రయాణీకులందరూ ముందుకు తూలి పడగా ఆడాళ్ల వెనకవున్న మగమందలోని మొసలి బొమ్మ టీషర్టుగాడొకడు మున్ముందుకే సోలి స్పర్శా నందం గ్రోలే వెర్రి ప్రయత్నం చేశాడు. రెబెక్కా వాడి పొట్టలో మోచేత్తో పొడిచి, 'స్టాప్ దేర్ మిస్టర్. యువర్ లిబర్టీ ఎండ్స్ వేర్ మై ఎల్బో ప్రొట్రూడ్స్,' అంది. అందుకు వాడు సినిమాఫక్కీలో విలన్ చూపొకటి విసిరి, 'ఓహో... మా అసలు లిబర్టీ ఇంకో తీర్గ వుంటది. చూపెట్టుమంటావా,' అన్నాడు. అపుడు రెబెక్కా వాడి కాలర్ పట్టుకుని 'ఏం చూపెడుతావురా స్కౌండ్రల్,' అంటూ వెనక్కి ఒక తోపు తోసింది. అది ఎంత బలమైన దంటే ఆ తోపుకు వాడూ, వాడి వెనక స్టాండింగ్ పాసెం జర్లు- టగ్ ఆఫ్ వార్ ఆటలో పొరపాటున తాడు తెగితే ఆట గాళ్లు ఎలా వెనక్కి బేలన్సు తప్పుతారో అలా పడి పోయారు!

'ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించి వేగంగా బళ్లు నడపడం, గుట్కా నములుతూ పబ్లిక్ ప్లేసుల్లో బూతులు కూయడం, అమ్మాయిల్ని ఏడిపించడం మాచిస్మో లక్షణాలనుకుంటారు వీళ్లు. వీళ్లకు 'ఝుక్మీ ఔరత్'లో డింపుల్ కపాడియా చేసిన శాస్తియే సరి యైనది,' అంటుంది రెబెక్కా.

వికవికా నవ్వుతుంది మధూలిక, "అంత పురుష ద్వేషం పనికిరాదే. రేపు పెళ్లయ్యాక నీ ఇవాన్హోతో ఎలా సంసారం చేస్తావే?"

సికందర్‌ని అలా పిలుస్తుంది మధూలిక. రెబెక్కాను అప్పుడప్పుడు అతను తన మొదటి ప్రపంచ యుద్ధం కాలంనాటి నార్టన్ మోటార్‌బైక్ మీద తీసుకొచ్చి కాలేజీలో దింపి వెళతాడు. రెబెక్కాకు తగినట్టుగా పొడుగ్గా వుంటాడు. పోతే ఎర్రగా, ఎండలో కమిలిన టర్కిష్ పోలికలు. కరాటే బ్లాక్ బెల్టు హోల్డర్.

"మీకు చరిత్ర తెలియదనుకోవాలి. రెబెక్కా ఇవాన్హోను పెళ్లి చేసుకోదు. సికిందర్ ఈజ్ అండ్ విల్ బి మై ఫ్రెండ్. దట్సాల్," అంటుంది రెబెక్కా తాపీగా.

'వుయ్ ఆర్ ప్రౌడ్ ఆఫ్ యూ రెబెక్కా. ప్రత్యేకించి నేను నీకు కృతజ్ఞురాల్ని..." వంట్లో కవోష్ణ రుధిర ధారలు పొంగుతున్నాయి. చలి ఎగిరిపోయింది. చతురస్రం మూడో భుజం పూర్తయింది. మెయిన్ రోడ్డు మీద డీలక్సు థియేటరు ముందు ఆగిన సిటీబస్సు హారన్ మోగి ఆగింది. ఆ వెంటనే చలిగాలి తరంగాల మీద మరో ధ్వని, సంగీత ధుని.

'తన్హా తన్హా ఇసీపే జీనా యెకోయి బాత్ హై...' రంగేలీ రాజాలా తన్మయంగా పాడుతూ సైకిల్ తొక్కుతూ పేపర్ కుర్రవాడు. అన్నయ్యకు పేపరు అందించదన్నమాట. ఏడీ అన్నయ్య... అక్కడెక్కడో అరకిలో మీటరు దూరాన... నానమ్మ కంటి అద్దాల్లాగా దళసరి పొగమంచు. ఏమీ కనపడదు. ఈ భుజం పూర్తయితే పార్కు చుట్టుకొలత పరిసమాప్తి. అన్నయ్య ఆపేసి, 'ఇక ఇంటికి పద,' అంటాడు. స్లో డవున్... ఎక్కువ కాలరీలు దహించినట్లుగా అనిపించడం లేదే వంట్లో! అన్నయ్యకి అక్కడ మేత దొరికింది. పేపర్ని అమూలాగ్రం నమిలేస్తాడు. మనం ఇలా వెనక్కి తిరిగి, తిన్నగా యూకలిప్టస్ వనందాకా వెళ్లి రావచ్చు. మహా అయితే ఇంకో పది నిమిషాలు... యస్. ఎబౌటర్న్. సౌష్టవం ప్రోది చేసుకున్న కొవ్వు కరిగించడమే ప్రస్తుత కర్తవ్యం.

సరిగ్గా నెలరోజుల క్రితం కాలేజీ వదిలాక ఆరోజు సాయంత్రం ఒక స్నేహితురాలి ఇంటికి వెళ్లి, నోట్సు తీసుకుని క్లాక్ టవర్ స్టాపు దగ్గర సిటీ బస్సు ఎక్కాల్సి వచ్చింది. ఎక్కేటప్పుడు కుడి కాలి చెప్పు జారిపోవడంతో, దానికోసం దిగేసరికి బస్సు కదిలింది. చెప్పు కాలికి వేసుకుని బస్సు కోసం చిన్నగా పరుగు. రెబెక్కా ఎడమ చెయ్యి అందించి బస్సులోకి లాగింది. చిన్నశ్రమకే వళ్లంతా చెమట. ఎగరొప్పుడు! రెబెక్కా అంది, "వొళ్లు ఇలాగే వుంచుకుంటూపోతే ఎందుకూ పనికిరాకుండా పోతావ్. గతంలో ఒకసారి సూచించాను కూడా. జిహ్వా చాపల్యం అరికట్టుకొమ్మని. ఉహు. నో యూజ్. వికా రంగా తయారవుతున్నావ్. నా మాట విను. జిమ్‌కి రా. ఏరోబిక్స్ నేర్పిస్తాను. సికందర్ ఆత్మరక్షణ మెళకువలు చెబుతాడు. ఈ కాలపు ఆడపిల్లకు తిండీ, చదువు ఈ రెండే పరమావధి కాదు. నేర్చుకోవాల్సినవి ఎన్నో వున్నాయని గుర్తుంచుకో!"

ఇంట్లోవాళ్లు నిన్ను జిమ్‌కి ససేమిరా పంప మన్నారు. అన్నయ్య వొక్కడే సానుభూతి చూపించాడు; రోజూ తనతో వాకింగ్‌కి రమ్మన్నాడు. పప్పులు, బంగాళా దుంపలు, నెయ్యి నిషిద్ధం. వాకింగ్... క్రమంగా జాగింగ్ లోకి... ఇప్పుడే నీవు నిజంగా వెల్ బీయింగ్ అనుభూతి నిస్తున్నావు. ఆరు కిలోల అనవసర భారం తగ్గింది. కీపిటప్... రెబెక్కా నీ స్ఫూర్తికి జోహార్లు.

ఆయాసమేమీ లేదు. హాయిగా వెళ్లు ముందుకు. ఆకాశం నీ హద్దురా...

"బీప్... బీప్...' క్లబ్ గ్రౌండులోంచి కోచ్ విజిల్. "సురేష్ లీవ్‌ద బాల్. అమర్... జంప్ అప్. యస్. అలాగే... ఇప్పుడు షూట్ - గుడ్. బాస్కెట్ నో... బీప్"

కోచ్ తెగ మొత్తుకుంటున్నాడు. బాస్కెట్‌బాల్ కోర్టులోని గెడకర్రలకు ఫోజులు ఇవ్వడం తప్ప ఆట ఆడే సత్తా లేనట్టుంది. 'ఎగైన్ సర్వ్... ఫార్వార్డ్... షూట్. అరే ఏమిటిది అమర్? ఇది వాలీబాల్ కాదు. చూడు బాల్ రోడ్డవతల పడింది. రన్ ఆఫ్టర్ ఇట్...'

పొడవాటి క్రీనీడ రోడ్డు క్రాస్ చేసింది. తెల్లచారల నీటి ట్రాక్ సూటు. బాల్ కోసం కందకంలో దిగి తల యిటు త్రిప్పింది. మందంగా... రాగం... ఈలపాట! అదే పాట పాడుతున్నాడు. వీడు వాడే... మొరిగే కుక్క. వీడికి ఇప్పుడు కాదు. మరోసారి ఎప్పుడైనా గట్టి బుద్ధి చెప్పాలి... గో ఆన్...

వీడి ఈలపాట మొదటిసారి రెణ్నెళ్ల కిందట లైబ్రరీలో వినడం జరిగింది కదూ? పుస్తకం తీసుకుని ఇవతలి కొచ్చి సైకిలు స్టాండు తీస్తూంటే కిటికీలోంచి వేశాడు ఈల. ఈలలో పాట. చామనఛాయ కోల ముఖం. సన్నని మీసకట్టు. రేబాన్ గ్లాసులు. సరేలే ఎవరో పిచ్చివాడు- సరదాగా ఈల వేస్తున్నాడు.

రెండోసారి ఆడిటోరియం వద్ద డాన్సు ప్రోగ్రాం చూద్దామని తమ్ముడితో కలిసి టికెట్లు తీసుకుంటుంటే కాఫీ షాపు నుండి మళ్లా అదే ఈల. నైక్ బూట్లు. టక్ చేసిన నల్లగళ్ల చొక్కా... రాత్రిపూట కూడా రేబాన్ కళ్లద్దాలు. గమ్మత్తేమంటే వాడి చేష్ట వెకిలిగా, అభ్యంతర పెట్టేదిగా అగుపించలేదు. రాగయుక్తంగా ఈల... పాట ఎప్పుడో విన్నపాట, ఏమిటది?

రాగం, శైలి వినిపిస్తే మధూలిక చెప్పింది అదేమి పాటో. 'నిను చూడక నేనుండలేను... ఈ జన్మలో, మరి ఆ జన్మలో...!'

ఔరా! ఘాటయిన పాటే, ఎవర్ని ఉద్దేశించి? ఇప్పుడు తెలిసిపోయింది. వీడు తన్నుతాను రోమియో లేదా మజ్నూ అనుకుంటున్నాడేమో! షిట్.

క్లబ్ బిల్డింగ్ దాటిపోయింది. బాస్కెట్‌బాల్ కోర్టు కనుమరుగయింది. ఎదురుగా రోడ్డు మీద పరుచుకున్న బిల్డింగు నీడ. రోడ్డు కుడివైపున కిలోమీటరు వరకు విస్తరించి మర్మర ధ్వని చేస్తున్న నల్లని యూకలిప్టస్ తోట... ఎడమవేపు రెండు ఫర్లాంగుల దూరంలో చర్చి శిఖరం మీద శిలువ మసక మసకగా కనపడుతోంది.

స్లో డవున్. ఇంత చలిలోనూ చెమట వచ్చేసింది. రోజూ ఈ మోతాదు స్టాండర్డ్... అరవై కిలోల దగ్గర వొళ్లు ట్రిమ్‌గా వుంటుంది. మధూలిక తన వైటల్ స్టాటిస్టిక్స్ గురించి మురిపెంగా చెపుతుంది. ముప్పయి ఆరు, ఇరవై నాలుగు, ముప్పయి అయిదున్నరట! దానికి అజ్ఞానమో, అహంభావమో కాని ఐశ్వర్యారాయ్‌వీ అవే కొలతలట! స్టాటిస్టిక్స్ పక్కన పడెయ్. కావాల్సింది ఫిజికల్ ఫిట్‌నెస్.

ఆనాడెప్పుడో ఫిజిక్సు లాబ్‌లో ప్రాక్టికల్స్ చేస్తున్నప్పుడు, అది డ్రై ఐసుముక్క నీ జాకెట్లో వేసి వికృతమైన హాస్యమాడింది. ఐసుముక్క తీసివేసే కంగారు ప్రయత్నంలో కుర్చీ మీంచి కిందపడి, భారీ శరీరాన్ని కూడదీసుకుని లేచి నిల్చోవడానికి కొంచెం ఆలస్యమయింది. నిన్ను 'జూనియర్ టున్ టున్,' అంది అప్పుడే. అదే ఆఖరు జోకు కావాలని గట్టిగా వార్నింగ్ ఇచ్చావు. సారీ చెప్పి చేతులు పట్టుకుంది. అయితే అది మానుకోలేని గుణాలు కొన్ని ఉన్నాయి. అవి తీవ్రమైన స్వానురాగ లక్షణాలు.

ఈ హెయిర్‌స్టైలు నీకు బాగాలేదు అంటే మీకు ఫ్యాషన్ తెలియదంటుంది. రెస్టారెంటులోకి వెళ్లి, అందరూ ఇడ్లీ ఆర్డరిస్తే అది సమోసా తింటాననంటుంది. ఎందుకా ప్రత్యేకత అని ఎవరన్నా అడిగితే పోషక విలువలున్న పదార్థాల గురించి ఎదుటి వాళ్లకెవరికీ తెలియదన్నట్టుగా లెక్చరిస్తుంది. ఒకసారి అది సరికొత్త డ్రెస్సు వేసుకొచ్చినప్పుడు, 'ముదురురంగు నీకు నప్పలేదు,' అని లావణ్య అంది. 'ఇది నిజానికో ఎక్సుపెరిమెంటల్ డిజైను...' అంటూ మధూలిక మొదలుపెట్టేసరికి రెబెక్కాకు చిర్రెత్తుకొచ్చి 'షటప్' అంది. దానికి రెచ్చిపోయి మధూలిక 'ఈస్థటిక్స్ సెన్సు ఏ మాత్రమూ లేని హెర్మాఫ్రొడైటువి నువ్వు,' అంది. రెబెక్కా ఆ మాటకు తీవ్రంగా స్పందించి దాన్ని చెంప మీద ఈడ్చి కొట్టింది.

'హెర్మాఫ్రొడైటు అంటే ఏమిటి అన్నయ్యా,' అనడిగితే ఆయన కోప్పడ్డాడు. "డిగ్రీలో నీది మాథ్స గ్రూపు, బయాలజీకాదు. అయినా నీవు కాలేజీకి వెళ్తోంది ఈ చెత్త విషయాలు నేర్చుకునేందుకా?"

అమ్మో- అన్నయ్య! సిమెంటు బెంచీ మీద కూర్చుని అగ్గిమీద గుగ్గిలంలా మండుతున్నాడేమో! పద వెనక్కి వేగం పెంచు, యస్.

ఏమిటా సవ్వడి, ఎండుటాకుల గలగలలు. రోడ్డు మీద అడుగుల చప్పుడు... బూట్ల ధ్వని? నీ బూట్ల చప్పుడు కాదు. మరెవరివో. వెనక చీకటి తప్ప ఏమీ లేదు కద. యూకలిప్టస్ తోట దగ్గర పిచ్చికుక్కలుంటాయి జాగ్రత్త అన్నాడు అన్నయ్య. మార్నింగ్ వాకర్స్ ఆర్ ఆఫెన్ బిటెన్ బై డాగ్స్. ఈ ప్రదేశం నుంచి తక్షణం నిష్క్రమించాలి. క్విక్.

గాలి కెరటాల్లో ఈల... పాట. దగ్గరగా మరింత దగ్గరగా, కుక్కలు పాడతాయా? చిన్నతనంలో 'అంతస్తులు', 'ఆమె ఎవరు' సిన్మాలు చూస్తున్నప్పుడు అన్నయ్య, 'అదిగో ఆ పాడేవి దెయ్యాలు,' అన్నప్పుడు భయమేసింది. నవ్వొస్తున్నది. ట్రాష్. అర్ధరాత్రి, నక్కల

ఊళలు, తోడేళ్ల అరుపులు, ప్రేతాత్మల వికృత ధ్వనులు... ఇలా కొన్ని కథల్లో కూడా వర్ణిస్తారు.

అదే పాట. 'నిను చూడక నేనుండలేను...' ఆగు. వెనక్కి తిరిగి... ఉహు... వాడే. ఒక చేతిని నోటి మీద అదిమిపెట్టి, వెనక నుండి బలంగా హత్తుకుంటున్నాడు.

"అరవకు అరిచినా ఎవరికీ వినపడదు. ఎన్నాళ్ల నుండో ఈ మంచి అవకాశం..."

స్కౌండ్రల్, ఇడియట్, రోగ్, లం... కొడుకు... ఎన్ని తిట్లు తిట్టినా ఏం ప్రయోజనం?

నిన్ను పూలచెండులా లేవనెత్తి రోడ్డు దిగుతున్నాడు. చీకట్లో యూకలిప్టస్ చెట్ల మధ్య... గడ్డి, గాదం, ఎండుటాకుల మీద విసిరి, వాడు పైకొచ్చేశాడు. ఒక చేత్తో నోరునొక్కి, మరో చెయ్యి కిందికి పోనిస్తూ దుస్తుల్లో...

పశుబలం వాడిది. ఎంత బాదినా, గీరినా చలించడంలేదు. 'అన్నయ్య, నాన్న, రెబెక్కా- సికిందర్‌ను వెంట తీసుకుని పరుగునరావే...' నీ పిచ్చిగాని ఎవరొస్తారు?

చెమట కంపు, నోట్లోంచి దుర్వాసన. డోకొస్తున్నది. స్పృహ తప్పుతున్నట్టుంది. ఎవరూ రారు. ఏ దేవుడూ నిన్ను రక్షించలేడు. దుండగుడు చురకత్తితో చీల్చాడు. బాధాకరమైన గాయం గుండెలో చేశాడు.

అబ్‌సొల్యూట్ జీరోవద్ద సమయం ఆగిపోయింది. ఉష్ణోగ్రత సున్న. ఘనపరిమాణం సున్న. పీడనం సున్న. అణువులు, అనుభూతి అంతా సున్న. సున్నా... నానమ్మ భాషలో జీవితమే సున్నా అయిపోయింది.

క్షణాలు, నిమిషాలు ఎన్ని దొర్లాయో తెలియదు, నీలో ఏమీలేదు. చుట్టూ చెట్లు, పైన చుక్కలు వున్నాయి. అస్తవ్యస్తమైన దుస్తులు సరిచేసుకో. పద ఇంటికి. లోకంలో ప్రళయం సంభవించనుంది.

స్పృహలో వుండే స్వప్నంలో నడక, అలవాటున కాళ్లు ఇంటికొచ్చాయ్. ఎదురుగా అమ్మ.

"అమ్మా..."

"ఏమయిందే? వాడు, అన్నయ్య ఎక్కడ? ఏమండీ, ఇట్లా రండి..."

చలి, వళ్లంతా మంచుముద్ద. కాళ్లు కూలబడిపోయినై.

*

ఆఫీసు గదిలో సీలింగు ఫాను చేస్తున్న సన్నని సవ్వడి, టేబిల్ మీద కాగితాల రెపరెపలు తప్ప అంతా నిశ్శబ్దం. కొన్ని క్షణాలపాటు ఎవరూ నోరు మెదపలేదు.

"నాకు ఫోను చేసి వుండాల్సింది. నేనో, సికందరో వచ్చి వాడిని తుక్కు కింద తన్ని వాడి యిల్లు నేలమట్టం చేసేవాళ్లం..." పిడికిలి బిగించి అంది రెబెక్కా.

"...అన్నయ్య నావెంట వచ్చాడు. నాకు కొండంత ధైర్యం. మహిళా పోలీసుస్టేషన్లో కంప్లయింట్ ఇవ్వడమూ, వైద్యపరీక్ష, రిపోర్టూ అన్నీ అయిపోయినై. అన్నయ్య మహిళాసంఘాల్నీ, మహిళాదక్షత కమిటీ సభ్యులనూ కలిశాడు. అన్నయ్య పూర్తి విశ్వాసంతో నాకు తోడుగా ఉన్నాడు..."

షిట్... కన్నీరేమిటి? ప్రిన్సిపల్ గరిమాదేవి తన కర్చీఫ్‌తో నీ కళ్లనీళ్లు తుడుస్తున్నది.

"అమ్మా, నాన్నల మీద మామయ్య, మామయ్య మీద మరేదో ఒత్తిళ్లు రోజూ వస్తున్నాయి. పరువు బజార్న పడేశాడు గదే అంటాడు నాన్న. 'మరేం ఫరవాలేదు. ఇంత జరిగినా మన మంచికి మలుచుకునే అవకాశం ఉంది,' అంటాడు మామయ్య. అసలు మానభంగం మీద సమాజం దృక్పథం మారదా మేడం? నేను ఏదో ఒకరోజు ధైర్యాన్ని కోల్పోతానేమోనన్న భయం కల్గుతోంది..." వెక్కిళ్లు...

"...దానివల్ల జీవితం కళంకమైపోతుందనే భావమే కళంకం. మానభంగాన్ని పవిత్రతకూ, కన్యాత్వానికీ ముడిపెట్టడం అవివేకం. జరిగింది ఒక పీడకల. మర్చిపో. నీకేమీ భయంలేదు. సంఘం తను సృష్టించుకున్న భయాలు, భేషజాల నడుమ కృత్రిమ దర్పం వొలకబోస్తూ బతుకుతున్నది. దాన్ని మార్చడం ఈ యువతరానికే సాధ్యమవుతుంది. నువు ముందు నడువు. ఆడపిల్లల్ని కరిచే కుక్కలకు సరియైన గుణపాఠం నేర్పాలి. నీ వెనక నారీ జగత్తంతా నిలబడుతుంది. ఐ ఎంపతైజ్ విత్ యూ. నీకు అన్నిరకాల సహాయం చేయడానికి మేమంతా సిద్ధం. నీవు ఒంటరిదానివి కావు. ఉద్యమ శక్తివి..."

ప్రిన్సిపల్ గరిమాదేవి తల్లిలా వెన్నుతట్టింది. రెబెక్కా, మధులికా, లావణ్య... తదితరులు వెచ్చటి కరస్పర్శల ద్వారా నూతనోత్తేజం అందిస్తున్నారు.

వందలకాళ్లు, వందల గొంతులు, నీకు రక్షణ కవచంలాగా నీ చుట్టూ. ఎదురుగా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసానికి, స్వాభిమానానికి ప్రతీకలా ఎత్తైన కాలేజీ బిల్డింగు, నింగిలోకి ఎగిరిన పావురాల గుంపు- స్వేచ్ఛా విహంగాల శ్రేణి. గుమ్మటాకారపు శిఖరంపైన మురిపించే మందారంలా సంధ్యాసూర్యుడు.

*సాహిత్యనేత్రం జన్మదిన ప్రత్యేక సంచిక, ఏప్రిల్-జూన్, 1996*